క్లుప్తంగా

హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

కొల్లాపూర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ఈ నెల 10న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంపును నియోజకవర్గంలోని జర్నలిస్టు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మాలె రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బొల్లం వెంకటస్వామియాదవ్‌లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద బ్రాంచ్ వైద్యులు హెల్త్ క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం అందజేత



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణానికి చెందిన శ్రావణ్ 10 రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.55వేలు బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల నాగరాజు, రమేష్, గణేశ్, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, శ్రీరాములు, ఆనంద్, తిరుపతి, బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి: ముగ్గురికి గాయాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. గ్రామంలో ముగ్గురిపై దాడి చేసి గాయపర్చింది. బాలమణి, అనూష, చిన్నారిలు కుక్కకాటుకు గురయ్యారు. బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు కుక్కను వెంబడించి చంపివేశారు.

అమరుల ప్రాణత్యాగమే నేటి ఫలితాలు



పాన్‌గల్: అమరుల ప్రాణత్యాగం వల్లనే తెలంగాణ రైతాంగ పోరాట ఫలితాలను ప్రజలు ఇప్పుడు అ నుభవిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ స భ్యులు ఎండీ.జబ్బార్ అన్నారు. శుక్రవారం పాన్‌గ ల్ మండలం రేమద్దులలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరా ట అమరుల సంస్మరణ సభలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి, కుల వివక్షత, అంటరానితనానికి వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి, పండించిన పంటలపై రైతులకు అధికారం ఉండటమే సాయుధ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, వెంకటయ్య, భగత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



గడ్డంపల్లి నుంచి వనపట్లకు వెళ్లే దారి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలలో వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని బీటీ రోడ్లు అధ్వానంగా తయారయ్యా. మట్టిరోడ్లు పూర్తిగా బురదమయంగా మారడంతో పాటు గుంతలలో వర్షపునీరు నిలిచింది. నెల్లికొండ నుంచి నాగనూల్‌కు వెళ్లే కంకర రోడ్డుపై ఏర్పడ్డ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఉయ్యాలవాడ నుంచి వెంకటాపూర్ వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల వనపట్ల నుంచి గడ్డంపల్లి వరకు కిలోమీటర్ వరకు రోడ్డు నిర్మాణం నిలిపివేయడంతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గట్టు రాయిపాకులలో కంకర తేలిన రోడ్డు



పెద్దకొత్తపల్లిలో లడ్డును దక్కించుకున్న దండు నర్సింహ



కోడేరులో అవార్డు అందుకుంటున్న మండప నిర్వాహకులు



గోవిందాయపల్లిలో లడ్డును దక్కించుకున్న వెంకటేశ్వర సిండికేట్ సభ్యులు

గంగమ్మ ఒడికి గణనాథులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండపాలలో కొలువుదీరిన గణనాథులు తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకొని శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. పలు మండలాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు వేలం పాట ద్వారా లడ్డును భక్తులు దక్కించుకున్నారు.

■ కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన గణనాథులను మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న ఎర్రకుంటలో నాలుగు క్రేన్ల వినాయకులను నిమజ్జనం చేశారు. ఉదయం 9.00 గంటలకు నిమజ్జనం ముగిసింది. విగ్రహాల వ్యర్థాలను రెండురోజులలో తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు.

■ ప్రత్యేక వాహనాలలో వినాయక ప్రతిమను ఊరేగించారు. డీజే మోతల మధ్య పురవీధుల గుండా భక్తులు ఆట పాటలు, మహిళలు బతుకమ్మలు, చిన్నారులు, యువత నృత్యాలతో గణనాథుడిని సాగనంపారు. చారకొండ సమీపంలో చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

■ తాడూరు మండలంలోని గోవిందాయపల్లిలో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డును వేలంలో వెంకటేశ్వర సిండికేట్ సభ్యులు రూ.3 లక్షలకు దక్కించుకున్నారు. అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో వినాయకుడిని ఉపాధ్యాయులు నిమజ్జనం చేశారు.



చారకొండలో గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

■ దోమలపెంటలో శ్రీశైలం ఆనకట్ట దిగువున ప్రవహిస్తున్న కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జిపై నుంచి గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అధికారులు ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బ్రిడ్జి వద్ద నుంచి ఈగలపెంట వరకు శ్రీశైలం ఘాట్ రోడ్డు మొత్తం ట్రాఫిక్ జామ్ నెలకొంది. దోమలపెంట అటవీ చెక్‌పోస్ట్ వద్ద టోల్ గేట్ వద్ద రుసుం వసూలు చేశారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో కుర్వ వీధిలో వినాయకుడి లడ్డును వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ బ్రదర్స్ రూ.1,51,116లకు దక్కించుకున్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

తిమ్మాజీపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో వినాయకుడికి పూజలు చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కోడేరు మండల కేంద్రంలోని శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంతబజారులో మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ మెంబర్ కేవీఎన్ రెడ్డి, జ్ఞాన వికాస్ భారత్ సంస్థ అధ్యక్షుడు గోవర్ధన్ మండల నిర్వాహకులకు అవార్డు అందజేశారు. చారకొండ మండలంలోని జూపల్లిలో భగత్‌సింగ్ యువజన సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణనాథుడినికి వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు ఉట్లు కొట్టారు.



కల్వకుర్తిలో నిమజ్జనం చేస్తున్న మట్టి వినాయక విగ్రహం



తిమ్మాజీపేట మండలం పోతిరెడ్డిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



చారకొండ మండలం జూపల్లిలో పూజలు చేస్తున్న భాస్కర్‌రావు



నిమజ్జనం చేస్తున్న అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

నవరాత్రి ఉత్సవాల కరపత్రాల విడుదల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు తదితరులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించుకునేందుకు సమిష్టిగా కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు రేవంత్, నితిన్, గిరిబాబు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అచ్చంపేట రూరల్: ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రధానికి రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పత్యానాయక్, అఖిల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, తులసీరాం, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా ప్రభుత్వం కృషి

వెల్దండ: రాష్ట్రంలోని రైతులకు యూరియా కొరత లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవసరం ఉన్న రైతులకు కేంద్ర ప్రభుత్వం యూరియా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాల రైతులకు యూరియా కొరత లేకుండా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. సింగిల్‌విండో ద్వారా, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా నిరంతరం యూరియా సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడు, ఎర్రశ్రీనుముదిరాజ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

కూలీల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న ఆంజనేయులు

అచ్చంపేట రూరల్: అడ్డా కూలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం అచ్చంపేటలో అడ్డా కూలీల డివిజన్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, లాలునాయక్, కవిత, ప్రధాన కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శులుగా టీక్యా, రాజు, తారాసింగ్, దేవేందర్, ఆంజనేయులు, రాములుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూలీలకు లేబర్ అడ్డా ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దేశ్యానాయక్, సైదులు, మల్లేష్, రాములు, పర్వతాలు, రేణయ్య పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



తాడూరు: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చి హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు కాశన్న, సుబ్బయ్య, బాలయ్య, షబ్బీర్, వెంకటమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌లో మంటలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ నుంచి మంటలు చెలరేగిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ చౌరస్తా, కూరగాయల మార్కెట్ ఎదుట ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



నాగర్‌కర్నూల్‌లో రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, తాడూరు, ఉప్పునుంతల, వెల్దండలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పలువురు రాధాకృష్ణన్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కొల్లాపూర్, తాడూరు, కల్వకుర్తి ఎంఈఓలు ఇమ్మానుయేల్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.





కల్వకుర్తిలో రాధాకృష్ణన్‌కు నివాళి, ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కందనూలు/కొల్లాపూర్/బిజినేపల్లి/పెద్దకొత్తపల్లి/లింగాల/తెలకపల్లి: నిత్యవసరాలపై జీఎస్టీలను తగ్గించి సామాన్య ప్రజలపై ఆర్థికభారం పడకుండా పన్నులలో సంస్కరణలు కేంద్ర ప్రభుత్వ తీసుకురావడాన్ని బీజేపీ నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుమ్మకొండ భూషయ్య, మల్లెకేడి బాలరాజు, ప్రమోద్‌కుమార్, నాగేంద్ర గౌడ్, గువ్వని నవీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సందు రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్ శివుడు, కేతూరి నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



పెంట్లవెల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీని జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు మండలాల్లో ర్యాలీలు తీశారు.

– నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ యువజన సంఘం నాయకుడు ఎండీ నసీర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు హబీబ్ రెహమాన్, ఆర్‌ఎంపీ డాక్టర్ సమీర్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రఫీ, ఖాజాబాబా, ఇస్సాక్ మియా, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

■ అచ్చంపేటలో జామె మసీద్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు.

■ పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

■ దోమలపెంటలో ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీద్‌లో ఇమామ్ మోయిజుద్దీన్ పండుగ విశిష్టతను వివరించారు.

■ లింగాల మండల కేంద్రంతో పాటు మండలంలోని అంబట్‌పల్లి, కోమటికుంట, మాడాపూర్, అప్పాయపల్లి తదితర గ్రామాల్లో మసీద్‌లను అందంగా ముస్తాబు చేశారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

■ మన్ననూర్‌లో ముస్లింలు జెండాలు పట్టుకుని ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీశైలం–హైద్రాబాద్ ప్రధాన రహదారిలోని మసీద్ వద్ద అన్నదానం చేశారు.

■ తిమ్మాజీపేటలో జామియా మసీథ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మసీద్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులో అన్నదానం చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

■ తెలకపల్లితో పాటు గౌరారంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జెండాలతో ర్యాలీ తీశారు.

■ కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అమ్రాబాద్‌లో సీట్లు పంచిపెట్టారు. సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తిమ్మాజీపేట జామీయ మసీద్ కమిటి అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్ ఎన్నికయ్యారు.



అచ్చంపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రెహమాన్



లింగాల మసీద్‌లో..

రైతులకు పరిహారం ఇవ్వాలి



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నర్సింహ

కోడేరు: మండలంలోని తీగలపల్లి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలు 5వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శివయ్య, వల్లి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్

కోడేరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకలకు ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరుకల కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జిల్లా కేంద్రంలో నూతన కమిటీ ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆదివాసి ఎరుకల బతుకులను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ఎరుకలి కులస్తులు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. మండల అధ్యక్షుడు మానుపాడు గోపాల్, ఉపాధ్యక్షుడు రమేష్, శాంతయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.